సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 17 । మే । 2023



దొంగలెవరో తేల్చాల్సిందే

గత ప్రభుత్వంలో రైతులకు సరఫరా చేసిన వ్యవసాయ పరికరాలను రికవరీ చేసి అమ్ముకున్న దొంగలెవరో తేల్చాల్సిందేనని జెడ్పీ సభ్యులు పట్టుబట్టారు. 8లో



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు, కనిష్టం రూ.12 వేలు, సరాసరి రూ.24 వేల ధర పలికాయి.

గరిష్ఠం/కనిష్ఠం
40.9°/22.5°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంది. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఏర్పాటవుతున్న వివిధ జాతీయ రహదారులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జేసీ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు వివిధ జాతీయ రహదారులకు భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఇందులో 127 హెక్టార్లకు సంబంధించి భూములు సేకరించిన రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు, ఆధార్ కార్డుల వివరాలను త్వరగా అందజేయాలన్నారు. వివరాలు అందిస్తే రైతులకు త్వరగా పరిహారం అందించే అవకాశం ఉంటుందన్నారు. దీంతో పాటు తక్కిన జాతీయ రహదారుల పనులకు భూ సేకరణ చేపట్టాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్, పుట్టపర్తి ,కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, కలెక్టరేట్ సూపరింటెండెంట్ బాలాజీ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

పరిగి: ఏపీఆర్‌ఎస్, ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్ డిగ్రీ విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎన్వీ మురళీధర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 20న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హాల్ టికెట్లను తమ ఐడీ నంబరు లేదా పుట్టిన తేదీని ఎంటర్ చేసి పొందవచ్చని చెప్పారు. ఆయా ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తప్పనిసరిగా బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్నులు, హాల్ టికెట్‌తో పాటూ తెచ్చుకోవాలని, అలాగే విధిగా సమయ పాలన పాటించాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబోమన్నారు.

గుంతకల్లు-మంత్రాలయం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని గుంతకల్లు – మంత్రాలయం రోడ్డు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 31 వరకు గుంతకల్లు జంక్షన్ (07187) నుంచి సాయంత్రం 5.40 గంటలకు బయలుదేరి రాత్రి 7.30 గంటలకు మంత్రాయం రోడ్డు రైల్వేస్టేషన్‌కు చేరుతుంది. ఇక తిరుగు ప్రయాణంలో ఈ నెల 19 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు మంత్రాలయం రోడ్డు రైల్వేస్టేషన్ (07188) నుంచి తెల్లవారుజామున 4.40 గంటలకు బయలుదేరి గుంతకల్లు జంక్షన్‌కు ఉదయం 6.20 గంటలకు చేరుతుంది.

ప్రశాంతంగా ఏపీఈఏపీసెట్



ఎస్‌ఆర్‌ఐటీ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏపీ ఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగజనార్దన

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్ రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా సాగింది. అనంతపురం జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో మూడు సెషన్లకు కలిపి మొత్తం 4,816 మంది పరీక్ష రాశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 506 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఏపీ ఈఏపీసెట్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు తెలిపారు. ఎస్‌ఆర్‌ఐటీ పరీక్ష కేంద్రాన్ని ఏపీఈఏపీసెట్ చైర్మన్ జింకా రంగజనార్దన పరిశీలించారు.



- డబ్బు కోసం భ్రూణహత్యలు
- డయాగ్నస్టిక్ సెంటర్లలో గుట్టుగా లింగ నిర్ధారణ
- రేడియాలజిస్ట్‌లు, గైనకాలజిస్ట్‌లు కుమ్మక్కై పరీక్షలు
- లింగనిర్ధారణతో భారీగా పెరుగుతున్న అబార్షన్లు
- అబార్షన్ వికటించి తాజాగా ఇద్దరు తల్లుల మృతి
- అమ్మాయిల సంఖ్యలో వెనుకబడిన ఉమ్మడి జిల్లా

అమ్మాయి పుడితే ఒక రకం, అబ్బాయి పుడితే మరోరకంగా చూస్తోంది ఈ లోకం. అమ్మా-నాన్నలకు, చిన్నవారికి-పెద్దవారికి, ఇలా ప్రతి ఒక్కరికీ అమ్మాయి తలలో నాలుకలా ఉంటుంది, చేదోడువాడుగా నిలుస్తుంది. త్యాగానికి ప్రతీక అమ్మాయి జీవితం. అలాంటి అమ్మాయిని మొగ్గలోనే తుంచేయడం ఎంత వరకు సబబు...? అమ్మాయిలు ఇంటికి దీపం లాంటివారు. వారికీ జీవించే అధికారం ఉంది. వారు కాబోయే తల్లులు.. మరి ఆ చిట్టి తల్లులను హత్య చేసే అధికారం ఎవరిచ్చారు..?

చిదిమేస్తున్నారు!

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో భ్రూణ హత్యలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఓవైపు సామాజిక మాధ్యమాలతో పాటు టీవీల్లో సైతం అమ్మాయి పుడితే లక్ష్మీదేవి ఇంటికొచ్చినట్టేనన్న ప్రకటనలు చూస్తున్నాం. వాస్తవానికి అమ్మాయి అని తెలియగానే కడుపులోనే బిడ్డను చిదిమేస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు కళ్లెం వేసేందుకు పటిష్టమైన చట్టం పీసీపీఎన్‌డీటీ (ప్రి కన్సెప్షన్ అండ్ ప్రినేటల్ డయాగ్నస్టిక్స్ టెక్నిక్స్) ఉన్నా సరిగా అమలు కావడం లేదు. దీంతో గుట్టు చప్పుడు కాకుండా భ్రూణహత్యలు జరుగుతున్నాయి.

చట్టం కఠినంగా ఉన్నా

రాష్ట్రంలో రేడియో డయాగ్నస్టిక్స్ సెంటర్లలో యథేచ్ఛగా లింగనిర్ధారణ జరుగుతోంది. స్వయానా ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేసే వైద్యురాలే లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిసినా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశమైంది. చట్టం కఠినంగా ఉన్నా అమలు సరిగా లేనికారణంగా కొన్ని ప్రైవేటు డయాగ్నస్టిక్స్ సెంటర్లు ఏ మాత్రమూ భయపడకుండా వ్యాపారం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఏటా 65వేల మందికి పైగా గర్భం దాలుస్తుండగా.. అందులో వివిధ కారణాల వల్ల 8 వేల వరకూ అబార్షన్‌లు జరుగుతున్నట్టు అంచనా.

బిడ్డ అడ్డం తిరిగిందని..ఎదుగుదల లేదని..

అబార్షన్లు చేయడంలో కూడా కొంతమంది వైద్యులు ఆరితేరిపోయారు. ముఖ్యంగా లింగనిర్ధారణ కోసం స్కానింగ్ చేసి.. బిడ్డ ఎదుగుదల సరిగా లేదని, దీని వల్ల పలు సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అబార్షన్ చేస్తే మంచిదని సూచిస్తారు. ముందే ఒప్పందం ప్రకారం ఆ గర్భిణి ఫలానా గైనకాలజిస్ట్ వద్దకు వెళుతుంది. ఆ రిపోర్టు చూడగానే అబార్షన్‌కు ఏర్పాటు చేస్తుంది. ఈ మొత్తం వ్యవహారం రూ.15వేల నుంచి రూ.20వేల ప్యాకేజీతో చేస్తున్నారు.

తాజా ఘటనలే ఉదాహరణలు

అబార్షన్లు, కాన్పులు ఎంత నిర్లక్ష్యంగా చేస్తున్నారనే దానికి తాజా ఘటనలే ఉదాహరణ. అనంతపురంలో ఆర్వేటి నగర్‌కు చెందిన సనం సుల్తానా పురిటినొప్పులతో రాగా డాక్టర్ల నిర్లక్ష్యంగా కారణంగా బాలాజీ నర్సింగ్ హోంలో తల్లీ బిడ్డ ఇద్దరూ మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన కవిత అనంతపురంలోని రూత్ నర్సింగ్‌హోంకు రాగా ఈమెకు ఇక్కడే లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్టు వెల్లడైంది. పుట్టబోయేది ఆడపిల్ల అని నిర్ధారించుకున్నాక అబార్షన్ చేశారు. ఆ తర్వాత పరిస్థితి విషమించి బాధితురాలు మృతిచెందింది. అబార్షను చేసిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అనంతపురం సర్వజనాసుపత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తుండటం గమనార్హం. ఇలా లింగనిర్ధారణ, అబార్షన్‌ల కారణంగా అనంతపురంలో ఆడపిల్లల సంఖ్య ఏటికేటికీ తగ్గిపోతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రజలు మేల్కొని భ్రూణహత్యలకు అడ్డుకట్ట వేసి.. అమ్మాయిలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో గడిచిన మూడు దశాబ్దాల్లో 1000 మంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య ఇలా..

జిల్లా	1991 సెన్సెస్	2001 సెన్సెస్	2011 సెన్సెస్
వైఎస్సార్	968	951	919
అనంతపురం	963	959	927
చిత్తూరు	970	955	931
ప్రకాశం	969	955	932
కర్నూలు	955	958	937
నెల్లూరు	937	954	945

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు ఇలా

పాలీ క్లినిక్‌లు	06
20 బెడ్‌లలోపు ఆస్పత్రులు	111
50 బెడ్‌లలోపు ఆస్పత్రులు	31
100 బెడ్‌లలోపు ఆస్పత్రులు	15
200 బెడ్‌లలోపు ఆస్పత్రులు	4
డయాగ్నస్టిక్ సెంటర్లు	81
హై ఎండ్ డయాగ్నస్టిక్ సెంటర్లు	6

డయాగ్నస్టిక్ సెంటర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు?

- లింగ నిర్ధారణ జరిగినట్టు తేలితే మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా
- వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టరు రిజిస్ట్రేషన్‌ను రద్దు లేదా సస్పెండ్ చేయొచ్చు
- లింగ నిర్ధారణ చేశారని తెలిసి, అబార్షన్ చేసిన గైనకాలజిస్ట్‌కు బెయిలు లేని మూడేళ్ల జైలు
- డయాగ్నస్టిక్ సెంటర్‌ను మూసేయడంతో పాటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారు
- బాధ్యులైన వైద్యులపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు

కఠిన చర్యలు తీసుకుంటాం



అనంతపురంలో సోమవారం అబార్షన్ వికటించి జరిగిన మాతృమరణం కలచివేసింది. ఈ ఘటనపై ప్రత్యేక బృందాలకు విచారణ బాధ్యతలు అప్పజెప్పాం. బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. లింగనిర్ధారణ అమానుష చర్య.

–డా.వీరబ్బాయి, జిల్లా వైద్యాధికారి

శాంతిభద్రతలపై రాజీలేదు

- అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలి
- ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించండి
- డీఐజీ అమ్మిరెడ్డి



సోమందేపల్లి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

పెనుకొండ/సోమందేపల్లి/పెనుకొండ రూరల్: శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తేలేదని డీఐజీ అమ్మిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పెనుకొండ, సోమందేపల్లి, పెనుకొండ రూరల్ పరిధిలోని కియా పోలీసుస్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీసుస్టేషన్‌లో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసులపై ఆరా తీశారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడకూడదని సిబ్బందికి ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయాలని తెలిపారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని , సైబర్ క్రైమ్, గృహహింస, గంజాయి రవాణా, మట్కా, పేకాట నిర్మూలనకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వెలుగుమాకులపల్లి క్రాస్ వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరిగే జంక్షన్‌ను డీఐజీ పరిశీలించారు. సీఐ కరుణాకర్, ఎస్‌ఐలు విజయ్‌కుమార్, వెంకటరమణ , సిబ్బంది పాల్గొన్నారు.

బోధనాస్పత్రికి మహర్దశ

- మైక్రో బయాలజీ విభాగానికి మరో 7 పీజీ సీట్లు మంజూరు



వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

అనంతపురం క్రైం: రాష్ట్ర ప్రభుత్వ విప్లవాత్మక చర్యలతో అనంతపురం బోధనాస్పత్రికి మహర్దశ పట్టింది. మైక్రో బయాలజీ విభాగానికి మరో 7 పీజీ సీట్లు మంజూరు చేస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మైక్రో బయాలజీ విభాగంలో పీజీ సీట్ల సంఖ్య 11కు చేరింది. రానున్న మూడేళ్లలో 33 మంది పీజీ విద్యార్థులు ప్రజలకు వైద్య సేవలందించనున్నారు. రాష్ట్రంలో ఏ కళాశాల మైక్రో బయాలజీ విభాగంలోనూ ఈ స్థాయిలో పీజీ సీట్లు లేవు. దీంతో బోధానాస్పత్రి వైద్యుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

ఏడాదికి 78 పీజీలు

ప్రస్తుతం బోధనస్పత్రి(అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల)లో పీజీ సీట్ల సంఖ్య 78కి చేరింది. ఫార్మకాలజీ 2, మైక్రోబయాలజీ 11, ఫోరెన్సిక్ 2, జనరల్ మెడిసిన్ 5, ఆర్థోపెడిక్ 3, ఓబీజీ 12, బయో కెమిస్ట్రీ 2, ఎస్‌పీఎం 3, పెథాలజీ 4, జనరల్ సర్జరీ 8, పీడియాట్రిక్స్ 4, ఈఎన్‌టీ 3, అప్తమాలజీ 3, ఫిజియాలజీ 4, సైకియార్టీ 2, డర్మటాలజీ 4, అనస్తీషియా 6 సీట్లున్నాయి. ఈ లెక్కన మూడేళ్లలో 234 మంది పీజీ వైద్యులు వివిధ విభాగాల్లో సేవలందిస్తారు.

నూతన ఆవిష్కరణలకు ఆస్కారం

పీజీ సీట్ల పెంపుతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించడంతో పాటు వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం మైక్రో బయాలజీ విభాగానికి పీజీ సీట్లు మంజూరు కావడంతో ఆ విభాగం వైద్యులు ప్రిన్సిపాల్‌కు పుష్పగుచ్ఛం అందించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మైక్రోబయాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆర్ హైమావతి, డాక్టర్ వేముల సరోజ, డాక్టర్ శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రత్న హారిక, ట్యూటర్లు డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఎస్ఆర్ డాక్టర్ లలిత భవాని, డాక్టర్ దివ్య, పీజీలు డాక్టర్ ఎల్లం నాయుడు, డాక్టర్ డైసీ, డాక్టర్ అభినయ, పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ అరుణ్‌బాబు



రెవెన్యూశాఖపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: 'ప్రజలకు రెవెన్యూశాఖపై నమ్మకం పెంచేలా నాణ్యమైన రెవెన్యూ సేవలను అందించాలి.. సేవలు అందించడంలో అధికారులు, సిబ్బంది ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్యలతో కలిసి రెవెన్యూశాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు రెవెన్యూశాఖ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు క్షేత్రస్థాయిలో వీఆర్‌ఓ నుంచి ఆర్డీఓ స్థాయి వరకూ అధికారులు ఎక్కువ కష్టపడి పనిచేయాలన్నారు. అధికారులంతా ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ప్రజలకు నాణ్యమైన రెవెన్యూ సేవలను అందించాలన్నారు. రెవెన్యూ, సర్వేశాఖలు వేర్వేరు కాదని రెండూ ఒకటేనన్నారు. ఆయా శాఖలు సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడడంలోనూ ప్రతి ఒక్కరూ శ్రద్ధపెట్టి పనిచేయాలన్నారు. అర్హత కలిగిన వారికి భూమి కేటాయించేటప్పుడు ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఇష్టానుసారం ప్రవర్తిస్తే అధికారులకే ఇబ్బందులు కలుగుతాయన్నారు. కోర్టు కేసులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా పని చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో హౌసింగ్ ఇళ్లు నిర్మాణంలో రెవెన్యూ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. అన్ని లేఅవుట్‌ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదాయ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు పెండింగ్ ఉంచకుండా సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, తిప్పేనాయక్, డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ బాలాజీ పాల్గొన్నారు.

'డెంగీ' నివారణకు కృషి

వృథా నీటి నిర్మూలన ద్వారా దోమలను అరికట్టి తద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు, స్థానిక సంస్థలు, పంచాయతీ అధికారులతో వారంలో రెండు, మూడు పర్యాయాలు గ్రామాల్లో, వీధుల్లో పర్యటించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ సంక్షేమ పథకాల అమలుపై ఈనెల 18న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌కు నివేదికలు సిద్ధం చేయడంపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వేతో పాటు స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలన్నారు. పశు సంవర్ధకశాఖ పరిధిలో లైవ్‌స్టాక్ పెంపుదల, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నేటి నుంచి విత్తన కాయలకు రిజిస్ట్రేషన్లు

- ఆర్‌బీకేల ద్వారా త్వరలో విత్తన పంపిణీ



వేరుశనగ విత్తన కాయల నాణ్యతను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు అవసరమైన విత్తన కాయలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నేటి నుంచి ప్రారంభంకానున్నాయి. విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని సబ్సిడీ విత్తన కాయలను పొందవచ్చు. జిల్లాలో 416 ఆర్‌బీకేలు ఉన్నాయి. ఆయా ఆర్‌బీకేల పరిధిలోని రైతులందరికీ విత్తన కాయలు సరఫరా చేస్తారు. కావాల్సిన రైతులు ముందస్తుగా విత్తన రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇప్పటికే నాణ్యమైన విత్తన కాయలను ఆర్‌బీకేలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి బస్తానూ పరిశీలించి నాణ్యమైన కాయలనే రైతులకు అందజేస్తామని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ కే-6, కదిరి లేపాక్షి (కే-1812) కంది, జీలుగ, పెసర, రాగులు ను పంపిణీ చేయనున్నారు. ఈ ఖరీఫ్‌లో వేరుశనగ విత్తన కాయలు 1,00,907 క్వింటాళ్లు, కంది 100 క్వింటాళ్లు, జీలుగ 34 క్వింటాళ్లు, రాగులు 350 క్వింటాళ్లు, పెసలు 50 క్వింటాళ్లు అందుబాటులో ఉంచనున్నారు.

పెరగనున్న సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం పెరగనుంది. గతం కంటే ఈ ఏడు మంచి వర్షాలు కురుస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనికితోడు రైతుల చెంతకే ఆర్‌బీకేల ద్వారా సకాలంలో విత్తన కాయలు అందించడం, ఖరీఫ్‌కు ముందస్తు వర్షాలు కురవడం, యంత్ర సేవ ద్వారా యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచడంతో అన్నదాతలు వ్యవసాయంపై మక్కువ చూపుతున్నారు. ఈ సంవత్సరం 2 లక్షల హెక్టార్ల వరకూ వేరుశనగ సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది 1.83 లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగైంది. అలాగే కంది 39,581 హెక్టార్లు , మొక్కజొన్న 21,373 హెక్టార్లు, రాగి 3,653 హెక్టార్లు, పత్తి 5,951 హెక్టార్లు, ఉలవలు 1568 హెక్టార్లు, వరి 4321 హెక్టార్లు, ఇతర పంటలు కలిపి సుమారు 2.70 లక్షల హెక్టార్లు సాగులోకి వచ్చింది. ఈ సంవత్సరం ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఖరారైన విత్తన ధరలు

వేరుశనగ విత్తన కాయలు 30 కిలోల బస్తాల్లో అందుబాటులో ఉన్నాయి. కే-6 రకం కాయలు ఒక్కో రైతుకు విస్తీర్ణం బట్టి గరిష్టంగా 3 బస్తాలు పంపిణీ చేస్తారు. ఒక బస్తా పూర్తి ధర రూ.2,790 కాగా సబ్సిడీ పోనూ రైతులకు రూ.1674 తో అందజేస్తారు. అదే కదిరి లేపాక్షి (కే–1812) రకం ఒక బస్తా పూర్తి ధర రూ.2,490 కాగా సబ్సిడీ పోను రూ.1494 అందజేస్తారు. పెసర 8 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.776 కాగా సబ్సిడీ పోనూ రూ.388 అందజేస్తారు. జీలుగ 10 కిలోల ప్యాకెట్ పూర్తి ధర రూ.790 కాగా రూ.395కు అందజేస్తారు. బుధవారం నుంచి వేరుశనగ విత్తనకాయల రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. ఈనెల 29 నుంచి విత్తన పంపిణీకి శ్రీకారం చుడతామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు చెప్పారు.

ఎస్‌ఐ హేమంత్‌పై గిరిజన మహిళ ఫిర్యాదు

- ఫిర్యాదు తీసుకోనందుకు పోలీసుస్టేషన్ ముందు నిరసన
- 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసిన బాధితులు



కదిరి రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాకు దిగిన బాధితులు

కదిరి: ముదిగుబ్బ ఎస్‌ఐ హేమంత్‌కుమార్‌పై కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన గిరిజన మహిళ బుక్యా రాధమ్మ మంగళవారం రాత్రి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట ఫిర్యాదు తీసుకోవడానికి రూరల్ సీఐ సూర్యనారాయణ నిరాకరించడంతో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కుమ్మరవాండ్లపల్లి సర్పంచ్ శాంతమ్మ, ఆమె కుమారుడు మణికంఠనాయక్, కుటుంబ సభ్యులు స్టేషన్ ప్రాంగణంలో ధర్నాకు దిగారు. చివరకు చేసేది లేక 100కు ఫోన్ చేసి తమకు జరిగిన అన్యాయాన్ని తెలిపారు. తర్వాత అక్కడి నుంచి డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని డీఎస్పీ శ్రీలతకు తమ గోడును వెళ్లబోసుకున్నారు. బాధితురాలు రాధమ్మ ఫిర్యాదు మేరకు.. ఎస్‌ఐ హేమంత్, కానిస్టేబుళ్లు రామాంజి, హరినాథరెడ్డితో పాటు టీడీపీ నాయకుడు కలాం ఆదివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో తమ ఇంటికి వచ్చారన్నారు. నీ భర్త గోవింద్‌నాయక్ మా దగ్గర ఉన్నాడు.. కావాలంటే ఫోన్‌లో మాట్లాడు అని ఫోన్ చేసి ఇచ్చారని తెలిపారు. 'పోలీసులతో ప్రాణహాని ఉంది. పోలీసులు చెప్పినట్టు చేయండి అని తన భర్త చెప్పడంతో మేం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌ఐ హేమంత్ బీరువా తాళాలు ఎక్కడున్నాయని బెదిరించాడన్నారు. అక్కడే నిల్చున్న పెళ్లీడుకొచ్చిన తన కూతురుతో అసభ్యంగా ప్రవర్తించాడని వాపోయారు. భయంతో ఆయనకు బీరువా తాళాలు ఇచ్చేశామని చెప్పారు. అమ్మాయి పెళ్లి కోసం తెచ్చిన 50 గ్రాముల బంగారంతో పాటు రూ. 5 లక్షల నగదు తీసుకున్నారన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే గోవిందనాయక్‌ను చంపేస్తామని ఎస్‌ఐ బెదిరించాడని ఆరోపించారు. అంతలోనే తన తమ్ముడు మణికంఠనాయక్‌తో పాటు చుట్టుపక్కల వారు రావడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారని తెలిపారు. తమ కూతురు పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు కులం పేరుతో దూషించడమే కాకుండా నగదు, నగలు ఎత్తుకెళ్లిన ఎస్‌ఐ హేమంత్‌తో పాటు కానిస్టేబుళ్లు రామాంజి, హరినాథ్, టీడీపీ నాయకుడు కలాంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్



జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రొద్దం: మండలంలోని శ్యాపురం అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 16 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.53,410 నగదు స్వాధీనం చేసుకుని ఆరు ద్విచక్రవాహనాలు సీజ్ చేశారు. దాడుల్లో ఎస్ఐ నాగస్వామి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం సంపూర్ణంగా అమలు చేయాలి

అనంతపురం: నూతన జాతీయ విద్యావిధానం -2020లోని అంశాలు సంపూర్ణంగా అమలు చేయాలని జేఎన్‌టీయూ (ఏ) వీసీ ఆచార్య జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూలోని పాలక భవనంలో మంగళవారం బీటెక్ కోర్సు రెగ్యులేషన్స్‌కు సంబంధించిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సదస్సులోఆయన మాట్లాడారు. మల్టీపుల్ ఎగ్జిట్, మల్టీపుల్ ఎంట్రీ, మైనర్ డిగ్రీ, ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్, ఆనర్స్ డిగ్రీ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి.సుమలత, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, పాల్గొన్నారు.

దొంగలెవరో తేల్చాల్సిందే

- వ్యవసాయ పరికరాలు అమ్ముకున్నదెవరు?
- జిల్లా అధికారిని నిలదీసిన జెడ్పీటీసీ సభ్యులు
- వాడీవేడిగా సాగిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



వాగ్వాదానికి దిగిన అనంతురం డీఏఓ చంద్రానాయక్, సభ్యులు రాధాస్వామి, భూతరాజ్‌కు సర్దిచెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: గత ప్రభుత్వంలో రైతులకు సరఫరా చేసిన రెయిన్ గన్లు, ఇతర వ్యవసాయ పరికరాలను రికవరీ చేసి.. కర్ణాటకలో అమ్ముకున్న దొంగలెవరో తేల్చాల్సిందేనని జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు పట్టుబట్టారు. పొంతనలేని సమాధానాలిచ్చిన జిల్లా వ్యవసాయాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగలెవరో జాబితా తమకు అందిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో జరిగిన స్థాయీ సంఘ సమావేశాలు వాడీవేడిగా సాగాయి. తొలుత స్థాయీ సంఘం సమావేశం -3 (వ్యవసాయ, అనుబంధ శాఖలు) పరిగి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప అధ్యక్షతన జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజ్ హాజరయ్యారు. తొలుత జెడ్పీ సీఈఓ చర్చను ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ తమ శాఖ ప్రగతి గురించి నివేదిక చదివి వినిపించే ప్రయత్నం చేయగా.. సభ్యులు అడ్డుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట రుణాల గురించి వివరించాలని కోరారు. అంతకంటే ముందు గత ప్రభుత్వం ఇచ్చిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు వంటి వ్యవసాయ పరికరాలు రైతుల నుంచి ఏటీలు రికవరీ చేశారని, అయితే వాటిని తిరిగి రైతులకు ఇవ్వకుండా కర్ణాటకలో కొందరు సరిహద్దు మండలాల అధికారులు అమ్ముకున్నారని ఆరోపించారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని సభ్యులు రాధస్వామి(కుందుర్పి), భూతరాజ్ (గుడిబండ), శ్రీనివాసరెడ్డి (లేపాక్షి), డాక్టర్ బాషా (గోరంట్ల) డిమాండ్ చేశారు. పరికరాలు అమ్ముకున్న వారి జాబితా ప్రభుత్వానికి పంపామని, తదుపరి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని డీఏఓ చెప్పగా.. సభ్యులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అన్నీ అబద్ధాలు చెబుతున్నారంటూ కడిగేశారు. దీంతో సమావేశ భవన్‌లో గందరగోళం నెలకొంది. జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. ఏటీలపై చర్యల కోసం ఉన్నతాధికారులకు పంపిన నివేదికను ఇక్కడ చదివి వినిపించాలని డీఏఓను కోరారు. ఇందుకు ఆయన సమాధానం దాటవేసేందుకు ప్రయత్నించడంతో సభ్యులు మరింత ఆగ్రహంతో ఊగిపోయారు. ఎన్ని రోజుల్లోగా చర్యలు తీసుకుంటారో సభ్యులకు సమాధానం చెప్పాలని చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశించగా.. 15 రోజుల్లోగా చర్యలు తీసుకుంటామని డీఏఓ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

- అంతకు ముందు చిరు ధాన్యాల సాగుపై ఆర్‌బీకేల్లో సదస్సులు నిర్వహించాలని, ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తమ వంతు సహకారం అందిస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. జలకళ కింద ఉచితంగా వ్యవసాయ బోరుబావులు తవ్వుకోవడానికి తమ మండలంలోని గ్రామాలకు 'వాల్టా' నుంచి మినహాయింపు ఇవ్వాలని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి భూగర్భ జల వనరుల శాఖ అధికారుల దృష్టికి తెచ్చారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం

స్థాయీ సంఘం-1, 7 (ప్రణాళిక, ఆర్థిక/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షత వహించారు. శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి గైర్హాజరు కావడంపై చైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని సభ్యులు శ్రీరాములు (పెనుకొండ), భూతరాజ్(గుడిబండ) ఆవేదన వ్యక్తం చేశారు. మండలాల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు శ్రీరామప్ప(పరిగి), శ్రీనివాసరెడ్డి(లేపాక్షి) ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించని అధికారులను ఉపేక్షించి లేదని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

- ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించిన చర్చ ప్రారంభంలో వేసవి సీజన్‌కు ముందే ప్రణాళిక రూపొందించుకోవాలనే విషయం తెలియదా అంటూ రెండు జిల్లాల ఎస్ఈలను చైర్‌పర్సన్ గిరిజమ్మ ప్రశ్నించారు. ప్రజలకు మంచినీళ్లు కూడా ఇవ్వకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు రాదా? అని నిలదీశారు. ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందో గుర్తించి, అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
- ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్లకిరువైపులా కంపచెట్లు పెరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. నిధులు రాగానే చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ అధికారులు బదులిచ్చారు.
- సచివాలయ ఉద్యోగుల పని తీరు ఇప్పటికీ మారడం లేదని, సచివాలయాలకు వచ్చే ప్రజలను గానీ, ప్రజాప్రతినిధులను గానీ వారు పట్టించుకోవడం లేదని సభ్యులతో పాటు చైర్‌పర్సన్ డీపీఓ ప్రభాకర్‌రావు దృష్టికి తెచ్చారు.

నేటి స్థాయీసంఘం సమావేశాలు ఇలా..

ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం – 2, 4, 5, 6 (గ్రామీణాభివృద్ధి/ విద్య, వైద్యం /స్త్రీ, శిశు సంక్షేమం /సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు జెడ్పీ సమావేశ ప్రధాన భవన్‌తో పాటు అదనపు సమావేశ భవనాల్లో నిర్వహించనున్నట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి.

మాజీ జవాన్ బలవన్మరణం



మృతుడు సూర్యనారాయణ

కనగానపల్లి: కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఆత్మస్థైర్యం లోపించి బీఎస్ఎఫ్ మాజీ జవాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కనగానపల్లి మండలం కుర్లపల్లికి చెందిన ఎం.సూర్యనారాయణ (50) బీఎస్ఎఫ్ జవాన్‌గా పని చేస్తూ రెండేళ్ల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య ఆదినారాయణమ్మ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దీనికి తోడు ఇటీవల అనారోగ్యం తీవ్రం కావడంతో ఆత్మస్థైర్యం లోపించింది. మంగళవారం ఉదయం పొలం వద్దకెళ్లిన ఆయన ఊజీ మాత్రలు మింగి ముళ్ల పొదల మాటున పడిపోయాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబసభ్యులు అక్కడకు వెళ్లేలోపు ఆయన మరణించారు. ఘటనపై కనగానపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

బత్తలపల్లి: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం పోట్లమర్రికి చెందిన హరిజన నాగభూషణ, నల్లమ్మ (44) దంపతులు వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నల్లమ్మ... జీవితంపై విరక్తితో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన కుమారుడు... అపస్మారక స్థితిలో పడి ఉన్న తల్లిని గమనించి వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ టీపీ శ్రీహర్ష తెలిపారు.

పరారీలో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ



రూత్ ఆస్పత్రికి చేరుకున్న డెమో అధికారులు

అనంతపురం క్రైం: భ్రూణ హత్యకు కారకురాలైన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తన వద్దకు చికిత్స కోసం వచ్చిన శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్లకు చెందిన గర్భిణీ కవిత (25)కు లింగనిర్ధారణ పరీక్ష చేసి, గర్భస్థ శిశువును ఆడపిల్లగా నిర్ధారించుకుని చేసిన అబార్షన్ వికటించి గర్భిణీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనపై మెడికో లీగల్ కేసు నమోదు కావడంతో రూత్ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ లక్ష్మీకాంతమ్మ పరారయ్యారు. ఘటనకు సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ డెమో బృందం మంగళవారం ఉదయం అనంతపురంలోని శ్రీనివాసనగర్‌లో డాక్టర్ లక్ష్మీకాంతమ్మ నిర్వహిస్తున్న రూత్ ఆస్పత్రికి చేరుకున్నారు. డాక్టర్ లక్ష్మీకాంతమ్మ లేకపోవడంతో ఆమెకు డెమో భారతి ఫోన్ చేసి, ఘటనపై ఆరా తీశారు. తాను ఈ నెల 14నుంచి ఊళ్లో లేనని, రెండ్రోజుల తర్వాత వస్తానంటూ లక్ష్మీకాంతమ్మ పేర్కొనట్లు తెలిసింది. గర్భిణీ మృతికి సంబంధించి ప్రశ్నిస్తే రెండ్రోజుల తర్వాత తానొచ్చి సమాధానమిస్తానని ఫోన్ పెట్టేసినట్లు సమాచారం. దీంతో డెమో సిబ్బంది వెనుదిరిగారు.

అలక వీడని ఈరన్న

- టీడీపీలో దళితులకు గౌరవం లేదంటూ ఆవేదన
- ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు దూరంగా ఉండాలని నిర్ణయం
- ఫలించని బీకే, పరిటాల సునీత బుజ్జగింపు
- బీకే ఒంటెత్తు పోకడలపై హైకమాండ్ సీరియస్

మడకశిర: నియోజకవర్గ టీడీపీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. టీడీపీలో దళితులకు గౌరవం లేదంటూ మాజీ ఎమ్మెల్యే, మాజీ టీడీపీ ఇన్‌చార్జ్ ఈరన్న అలకబూనారు. ఈ క్రమంలో బుధవారం మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు దూరంగా ఉండాలని ఈరన్న వర్గం మొత్తం నిర్ణయించుకుంది.

రంగంలో దిగిన బీకే, పరిటాల సునీత

అలకబూనిన ఈరన్నను బుజ్జగించేందుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, రంగంలో దిగారు. రొద్దం మండలంలోని తన స్వగ్రామం మరువపల్లికి ఈరన్నను పిలిపించుకుని చర్చించినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల విజయవంతానికి సహకరించాలని కోరినట్లు తెలిసింది. టీడీపీలో దళితులకు సరైన గౌరవం దక్కడం లేదని ఈరన్న ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. స్థానికంగా ఉన్న తనకే ఆహ్వానం లేనప్పుడు తానెందుకు హాజరు కావాలని ప్రశ్నించడంతో బీకే స్వీయరక్షణలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత సైతం ఈరన్నకు ఫోన్ చేసి ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆమెతో తన మనసులోని మాటను ఆయన నిర్మోహమాటంగా చెప్పినట్లు సమాచారం.

బీకే తీరుపై ఈరన్న వర్గం గుర్రు

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బీకే పార్థసారథి వ్యవహరిస్తున్న తీరుపై ఈరన్న వర్గం గుర్రుగా ఉంది. ఆయన ఒంటెత్తు పోకడలతోనే మడకశిరలో టీడీపీకి ఈ గతి పట్టిందని బహిరంగంగానే ఈరన్న వర్గం మండి పడుతోంది. ఓ వర్గాన్ని ప్రోత్సహిస్తూ మరో వర్గాన్ని అణచివేయాలని చూస్తున్నాడని ఈరన్న వర్గీయులు ఆరోపిస్తున్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన వారిని కాదని, వలస వచ్చిన నాయకుడికి అందలం ఎక్కించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో అగ్రకులాలు, డబ్బున్న వారికే విలువ నిస్తున్నారని వాపోతున్నారు. ఈ క్రమంలో బీకే వైఖరిపై పార్టీ అధిష్టానం సీరియస్ అయినట్లు తెలుస్తోంది. గ్రూప్ రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీని బలహీనపరుస్తున్నాడని నియోజకవర్గాల వారీగా ఇప్పటికే అధిష్టానానికి నివేదికలు అందడమే ఇందుకు కారణమని పలువురు పేర్కొంటున్నారు. ఈరన్నతో కలసి పార్టీ కార్యక్రమాలు చేపట్టాలని, లేకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేయడంతో ఈరన్నను పిలిపించుకుని మాట్లాడినట్లు సమాచారం.

యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్



కానిస్టేబుల్ షేక్షావలికి రివార్డు అందజేస్తున్న డీఎస్పీ కంజాక్షన్, ఎస్ఐ హరూన్‌బాషా

హిందూపురం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేయబోయిన యువకుడిని సకాలంలో కానిస్టేబుల్ కాపాడాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన రవి, అనిత దంపతులు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో మనస్తాపం చెందిన రవి.. మంగళవారం ఉదయం బ్యాగ్ సర్దుకుని ఇంటి నుంచి బయటకు వచ్చి నేరుగా రైలు పట్టాలపైకి చేరుకుని తన స్నేహితుడు నాగరాజుకు వీడియో కాల్ చేసి, మాట్లాడాడు. తాను ఆత్మహత్య చేసుకోబోతున్నానని తెలిపి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. పలుమార్లు కాల్ చేసినా ఫలితం లేకపోవడంతో నాగరాజు వెంటనే డయల్ 100కు సమాచారం అందించి ద్విచక్ర వాహనంపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. అప్పటికే అప్రమత్తమైన కానిస్టేబుళ్లు తలో దిక్కుకు బయలుదేరారు. నాగరాజు అందించిన సమాచారంతో కానిస్టేబుల్ షేక్షావలి నేరుగా రైల్వే స్టేషన్ చేరుకుని పట్టాల వెంబడి రవి కోసం గాలింపు చేపట్టాడు. లయోలా స్కూల్ సమీపంలో దూసుకువస్తున్న రైలుకు ఎదురుగా పట్టాలపై కూర్చొని ఉన్న రవిని గమనించి వెంటనే వెళ్లి పక్కకు లాగేశాడు. ఆ సమయంలో కానిస్టేబుల్ పట్టు నుంచి తప్పించుకునేందుకు రవి విఫలయత్నం చేశాడు. ఈ లోపు రైలు వెళ్లిపోవడంతో రవిని సముదాయించి స్టేషన్‌కు పిలుచుకెళ్లాడు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కంజాక్షన్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రవి దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఇంటికి పంపారు. తక్షణం స్పందించి నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుల్ షేక్షావలిని అభినందిస్తూ రివార్డు అందజేశారు.

'ఆ సదస్సుతో సంబంధం లేదు'

అనంతపురం అర్బన్: ఏపీ అమరావతి జేఏసీ బుధవారం తలపెట్టిన ప్రాంతీయ సదస్సుతో తమకు సంబంధం లేదని ఏపీ రెవెన్యూ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఏపీ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.విజయభాస్కరరెడ్డి, కార్యదర్శి బి.పెద్దన్న, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు వై.మన్మధరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.లక్ష్మయ్య మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ అమరావతి జేఏసీ ప్రాంతీయ సదస్సుతో వీఆర్ఓలు, వీఆర్ఏలు, వీఆర్ఓ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారికి ఎలాంటి సంబంధం లేదన్నారు. తామంతా ఏపీ రెవెన్యూ జేఏసీలో కొనసాగుతున్నామన్నారు. కాబట్టి వీఆర్ఓలు, వీఆర్ఏలు, ఎస్ఏలుగా పదోన్నతి పొందిన వీఆర్ఓలు ఈ సదస్సుకు హాజరు కాకూడదని సూచించారు.

లోయలో పడిన కారు..ఒకరు మృతి

- పెనుకొండ సమీపంలోని జాతీయ రహదారిపై ఘటన



మృతుడు చరణ్ తేజ్ (ఫైల్)



గాయపడిన కృష్ణవేణి



ఈశ్వరయ్య

పెనుకొండ రూరల్ : ఇంటర్ అడ్మిషన్ కోసం బెంగళూరు వెళ్లి తిరిగి వస్తున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఇదే ప్రమాదంలో ఇతడి తల్లిదండ్రులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం సిండికేట్ నగర్‌కు చెందిన ఈశ్వరయ్య, కృష్ణవేణి దంపతుల కుమారుడు చరణ్‌తేజ్ (15) ఇటీవలే వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణుడయ్యాడు. చరణ్‌తేజ్‌ను బెంగళూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివించాలని తల్లిదండ్రులు భావించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం ఈశ్వరయ్య దంపతులు కుమారుడు చరణ్‌తో కలిసి కారులో బెంగళూరు వెళ్లారు. కళాశాలలో పని చూసుకుని సాయంత్రం అనంతపురానికి తిరుగు పయనమయ్యారు. వీరి వాహనం రాత్రి 11 గంటల సమయంలో పెనుకొండ హరిపురం వై జంక్షన్ సమీపంలోకి రాగానే సిమెంట్ దిమ్మెను ఢీకొంది. దాదాపుగా 10 అడుగులో లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ సీట్ పక్కన కూర్చున్న చరణ్ తేజ్ (15) తలకి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ఘటనలో ఈశ్వరయ్య, కృష్ణవేణిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు. పెనుకొండ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఈతోడు ఎంపీటీసీ దుర్మరణం

- బైక్ అదుపు తప్పడంతో ప్రమాదం



ఈశ్వరప్ప (ఫైల్)

తనకల్లు: మండలంలోని కొక్కంటి క్రాస్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఈతోడు ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరప్ప (50) మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు...రాకుంటపల్లికి చెందిన ఈశ్వరప్ప, తన స్నేహితుడు ఓబులేసుతో కలసి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కొక్కంటి క్రాస్‌కు బయలుదేరారు. ఆర్డీటీ ఆస్పత్రి వద్దకు చేరుకోగానే వాహనం నడుపుతున్న ఓబులేసు వేగాన్ని నియంత్రణ చేసుకోకపోవడంతో అదుపు తప్పి కిందపడ్డారు. బైక్‌పై వెనుక కూర్చొన ఈశ్వరప్ప డివైడర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఓబులేసుకూ బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు తనకల్లు పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఈశ్వరప్ప మృతిచెందారు. మృతునికి భార్య రాధమ్మ, కుమారుడు నరేంద్రకుమార్ ఉన్నారు. ఓబులేసును మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఘటనపై ఎస్ఐ రాంభూపాల్ దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం



నూర్ మహమ్మద్

బొమ్మనహాళ్: మండల కేంద్రానికి చెందిన నూర్ మహమ్మద్ అనే వ్యక్తి నాలుగు రోజుల కిందట బళ్లారిలోని ఆస్పత్రికి వెళ్తున్నట్లు చెప్పి అదృశ్యమైనట్లు ఎస్ఐ శివ తెలిపారు. తన భర్త కనిపించడం లేదని భార్య తెహరాన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

వారసత్వం పొందితే సొమ్ము చెల్లించాల్సిందే

అనంతపురం: వారసత్వ హక్కు పొందితే బేషరతుగా సొమ్ము చెల్లించాల్సిందేనని జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ ఎం. శ్రీలత మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురానికి చెందిన చంద్రశేఖర్.. 2018, జనవరి 18న మరణించారు. ఆయన పేరున ఉన్న ఎస్‌బీఐ ఖాతాలో రూ.28 లక్షలకు వివాహితైన కుమార్తె నాగమణి తప్ప ఇతర వారసులు ఎవరూ లేరు. ఈ నేపథ్యంలో నాగమణి అప్పట్లో బ్యాంక్ అధికారులను కలసి తన తండ్రి పేరున బ్యాంక్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఇందుకు బ్యాంక్ అధికారులు సమ్మతించకపోవడంతో ఆమె జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై చంద్రశేఖర్‌కు తానే భార్యనంటూ అన్ని దాఖలాలు సమర్పించిన అశ్వత్థమ్మ అనే మహిళకు ఆయన ఖాతాలోని మొత్తాన్ని చెల్లించినట్లు బ్యాంక్ అధికారులు వివరణ ఇచ్చారు. అంతేకాక నాగమణికి మూడేళ్ల వయసున్నప్పుడే బిడ్డను పిలుచుకుని చంద్రశేఖర్ భార్య నాగలక్ష్మి ఇల్లు వదిలి వెళ్లిపోయిందని, అప్పటి నుంచి ఖాతాకు నామినీగా ఎవరి పేరు లేదని పేర్కొన్నారు. అయితే తాను బ్యాంక్ అధికారులను సంప్రదించిన తర్వాత వారు కోరిన ప్రతి పత్రాన్ని అధికారికంగా తీసుకుని అందజేసినట్లు నాగమణి వాదనలు వినిపించారు. వారసత్వ హక్కు పత్రాన్ని 2019 మే 13న అందజేసినప్పటికీ తనను బ్యాంక్ చుట్టూ తిప్పుకున్నారని వాపోయారు. దీనిపై కమిషన్ స్పందించింది. వారసత్వ పత్రం పొందిన వారికి కాకుండా ఇతరులకు సొమ్ము చెల్లించడం భావ్యం కాదని పేర్కొంటూ చంద్రశేఖర్ కుమార్తెకు అతని పేరున బ్యాంక్‌లో ఉన్న నగదు మొత్తం వారసత్వ పత్రం అందజేసినప్పటి నుంచి 6 శాతం వడ్డీతో నెలలోపు చెల్లించాలని, మనోవేదనకు గురి చేసినందుకు రూ.30 వేలు, సేవాలోపానికి రూ.20 వేలు, ఖర్చులకు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.55వేలు పరిహారాన్ని చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత, సభ్యులు డి.గ్రేస్ మేరీ, బి. గోపీనాథ్‌ల ధర్మాసనం తీర్పు వెలువరించింది.